# ఎమ్మెల్యే కాలేరు ఇంటింటి ప్రచారం షురూ



రామంతాపూర్ నల్ల పోచమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ దంపతులు

గోల్నాక/కాచిగూడ, అక్టోబర్ 16 : ప్రధాన ప్రతిపక్షాలైన బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల పేర్లు ఇంకా ఖరారు కాకముందే అం బర్‌పేట నియోజవర్గంలో అట్టహాసంగా బీఆర్‌ఎస్ పార్టీ ప్రచార పర్వాన్ని ప్రారంభించింది. సోమవారం నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మ దంపతులు అంబర్‌పేట ప్రధాన రహదారిలోని నల్ల పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అంబర్‌పేట డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సిద్ధార్థ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నియోజకవర్గం సుమారు వెయ్యికి పైగా బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులుతో కలసి అంబర్‌పేట డివిజన్ బాపునగర్‌లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అంబర్‌పేట ని యోజకవర్గంలో గత నాలుగున్నరేండ్లలో జరిగిన అభివృద్ధి, బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలకు జై కొడుతూ స్థానిక మహిళలు మంగళహారతులు ఇచ్చి ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌కు ఆత్మీయ స్వాగతం పలికారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు నియోజకవర్గ అభివృద్ధిని వివరిస్తూ రూపొందించిన కరపత్రాలను ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఓటర్లకు అందజేస్తూ మరో సారి తనను ఆశీర్వదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు విజయ్‌కుమార్‌గౌడ్, బి.పద్మావెంకట్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు బి.వెంకట్ రెడ్డి, లవంగు ఆంజనేయులు, మోర శ్రీరాములుమదిరాజ్, దిలీప్ రాజ్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

● అంబర్‌పేట నియోజకవర్గంలో

గత 15 ఏండ్లల్లో లేని అభివృద్ధి..కేవలం నలుగున్నర ఏండ్లలోనే ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేశాడని గోల్నాక డివిజన్ మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మావెంకటేశ్ అన్నారు. గోల్నాక డివిజన్‌లోని నెహ్రూనగర్, సుందర్‌నగర్, శాస్త్రీనగర్, తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌కు మద్దతుగా 200 మంది మహిళలతో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం అనంతరం విలేకరులతో మాజీ కార్పొరేటర్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌ను రెండవసారి భారీ మెజార్టీతో గెలిపిస్తామని ఏకగ్రీవ తీర్మానం చేశారు. సీఎం కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలే అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌ను రెండవసారి గెలిపిస్తాయని అన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు ఎమ్మెల్యే సొంత ఖర్చుతో పేద, నిరుపేద ప్రజలకు చేస్తున్న సేవా కార్యక్రమాలు ప్రతి ఒక్కరినీ విశేషంగా ఆకర్శిస్తున్నాయని ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పద్మ, డాక్టర్ దీప్తిపటేల్ పాల్గొన్నారు.




బాపునగర్‌లో కరపత్రాలు అందజేస్తూ ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

## గాయత్రిదేవిగా మహంకాళి అమ్మవారు

అంబర్‌పేట, అక్టోబర్ 16: శరన్నవరాత్రి ఉత్సవాలు అంబర్‌పేట నియోజకవర్గంలో ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా అంబర్‌పేట మహంకాళి అమ్మవారిని సోమవారం శ్రీగాయత్రిదేవిగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అలాగే బతుకమ్మకుంట మైసమ్మ అమ్మవారు కూడా గాయత్రిదేవిగా దర్శనమిచ్చారు. గోల్నాక దుర్గానగర్‌లో గల శ్రీదుర్గామైసమ్మ అమ్మవారిని మాజీ కార్పొరేటర్ కె.పద్మావతిడీపీరెడ్డి దర్శించుకొన్నారు.



గాయత్రిదేవిగా దర్శనమిచ్చిన మహంకాళి అమ్మవారు



మైసమ్మను దర్శించుకున్న మాజీ కార్పొరేటర్ కె.పద్మావతిడీపీరెడ్డి

## ప్రతిపక్షాల అడ్రస్ గల్లంతు చేస్తాం..

గోల్నాక, అక్టోబర్ 16 : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అంబర్‌పేటలో ప్రతిపక్షాల అడ్రస్ గల్లంతు చేస్తామని అంబర్‌పేట డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సిద్ధార్థముదిరాజ్ స్పష్టం చేశారు. అందుకు అంబర్‌పేట డివిజన్‌లో తొలి రోజు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ చేపట్టిన ఇంటింటి ప్రచారానికి ప్రజలు చూపించిన అపూర్వ స్పందనే ఇందుకు నిదర్శనమని అన్నారు. పార్టీ మ్యానిఫెస్టో చూసి ప్రతిపక్షాలకు మైండ్ బ్లాక్ అయ్యిందని ఆయన అన్నారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల కంటే ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌ను అంబర్‌పేట డివిజన్ నుంచి భారీ మెజార్టీతో గెలుపించుకుంటామని ఆయన అన్నారు.

## మద్యం బాటిళ్లు స్వాధీనం

కాచిగూడ,అక్టోబర్ 16: నిబంధనలకు విరుద్ధంగా మద్యం బాటిళ్లను విక్రయిస్తున్న ఓ వ్యక్తిని కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణరాజు, ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. తిలక్‌నగర్‌లోని చైతన్యనగర్ ప్రాంతానికి చెందిన కృష్ణ(62) తిలక్‌నగర్ బ్రిడ్జి కింద మద్యం బాటిళ్లను అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నాడు. సమాచారం అందుకున్న ఎస్సై నరేశ్ ఘటనా స్థలానికి చేరుకుని కృష్ణ నుంచి 31 క్వాటర్ బాటిళ్లు,10 90ml బాటిళ్లను స్వాధీనం చేసుకొని సోమవారం కృష్ణను అరెస్ట్ చేసినట్లు కాచిగూడ పోలీసులు తెలిపారు.

## రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

కాచిగూడ,అక్టోబర్ 16: వ్యక్తి రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్, కొల్లాపూర్ ప్రాంతానికి చెందిన శివుడు(33) ఐసిఐసిఐ బ్యాంక్ ఉద్యోగి. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అనేక దవాఖానల చుట్టూ తిరిగినా నయంకాలేదు. దీంతో మనస్థాపం చెందిన శివుడు సోమవారం మలక్‌పేట–కాచిగూడ రైల్వేస్టేషన్‌ల మధ్య తిలక్‌నగర్ బ్రిడ్జి సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

## ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ,అక్టోబర్ 16: ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై డి.సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి(55)కాచిగూడ రైల్వేస్టేషన్ ఎదురుగా పోస్టాఫీస్ ఫుట్‌పాత్‌పై అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. సమాచారం అందుకున్న కాచిగూడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుని ఒంటిపై నలుపు రంగు చొక్కా, నషం రంగు ప్యాంట్ ధరించి ఎత్తు 5.6 ఉన్నట్లు తెలిపారు. వివరాల కోసం 8712660542లో సంప్రదించాలని ఎస్సై కోరారు.

# ఎన్నికల నిబంధనలు తప్పకుండా పాటించాలి

● ఆరు ఫ్లయింగ్ స్కాడ్స్, వీడియో సర్వేలైన్స్ టీమ్‌ల ఏర్పాటు

● రిటర్నింగ్ అధికారి బి. అపర్ణ

అంబర్‌పేట, అక్టోబర్ 16 : అంబర్‌పేట నియోజకవర్గంలో అన్ని పార్టీలు తూచా తప్పకుండా ఎన్నికల నిబంధనలు పాటించాలని ఎన్నికల అధికారి(ఆర్వో) బి.అపర్ణ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అంబర్‌పేట తాసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని విడుదల చేయడంతో పాటు ప్రతి ఒక్కరూ విధిగా నియమ నిబంధనలను పాటించాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అధికారులు, రూట్, సెక్టోరియల్ అధికారులను నియమించారు.

**ఎన్నికల సహాయ కేంద్రం ఏర్పాటు...**

ఎన్నికల కంట్రోల్ రూమ్, ఫిర్యాదులు స్వీకరించేందుకు ఆర్వో కార్యాలయంలో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు. సమాచారం కోసం 1950లో సంప్రదించవచ్చని తెలిపారు.

**సువిధా కేంద్రం...**

సింగిల్ విండో క్లియరెన్స్ కోసం రిటర్నింగ్ కార్యాలయంలో సువిధ కేంద్రం ఏర్పాటు చేశారు. రాజకీయ పార్టీల సమావేశాలు, ర్యాలీలు, ఇతర కార్యక్రమాల అనుమతులను సువిధా కేంద్రం ద్వారా క్లియర్ చేయనున్నారు. దరఖాస్తులు చేసుకున్న 24 గంటల్లోనే క్లియర్ చేయనున్నారు.



అపర్ణ, ఎన్నికల అధికారి

**సర్వేలైన్స్ టీంలు..**

అంబర్‌పేట నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణ కోసం సర్వేలైన్స్ టీంలను ఏర్పాటు చేసినట్లు ఆర్వో బి.అపర్ణ తెలిపారు. అలాగే నియోజకవర్గంలో ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు ఏర్పాటు చేశామని అన్నారు. ఈ టీంలో ఒక ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్, ఒక సీనియర్ పోలీస్ అధికారి, ఒక ఆర్మ్‌డ్ పోలీసు, ఒక వీడియో గ్రాఫర్ ఉంటారు. నియోజకవర్గం వ్యాప్తంగా సంచరిస్తూ రాజకీయ పార్టీల కదలికలను, ఎన్నికల నిబంధనలు పాటించని వారిపై కొరడా ఝులిపించేందుకు విధులు నిర్వహిస్తారు. అదే విధంగా వీడియో సర్వేలైన్స్ టీంలు కూడా పని చేస్తాయని పేర్కొన్నారు. మరో వీడియో వీవింగ్ టీం కూడా అందుబాటులో ఉండి మేజర్ పొలిటికల్ ర్యాలీలు, మీటింగ్‌లపై నిఘా పెడతారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను అతిక్రమించినా, ప్రభుత్వ భవనాలు, గెస్ట్‌హౌజ్‌లు, వాహనాలు వాడినా చర్యలు తీసుకుంటారు.

**వాహనాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి..**

అంబర్‌పేట నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులు తమ వాహనాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. ప్రార్థనా మందిరాలు, ప్రైవేటు స్థలాల్లో యజమానులకు సమాచారం లేకుండా ఎలాటి రాజకీయ అవసరాలకు వాడుకోరాదు. ఎన్నికల నిర్వహణ కోసం వివిధ విభాగాల నుంచి అధికారులు పని చేస్తునా్రు. రూట్, సెలక్టోరియల్ అధికారులను నియమించాం. నియోజకవర్గంలో ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వేలైన్స్ టీం, వీడియో వీవింగ్ టీంలను ఏర్పాటు చేశాం. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. అంబర్‌పేట తాశీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడంతో పాటు హెల్ప్‌డెస్క్‌ను, సువిధా కేంద్రాలను ఏర్పాటు చేశాం.

# 'అభీ నహీతో కభీ నహీ బస్ భరో' కార్యక్రమం

కాచిగూడ,అక్టోబర్ 16: దసరా పండుగను పురస్కరించుకుని ఈ నెల 21–23, 28–30 తేదీలలో ఆర్టీసీ బస్సులలో ప్రయాణించే వారు లక్కీ డ్రాలో పాల్గొని లక్షల విలువైన బహుమతులను గెలుచుకోవచ్చని కాచిగూడ ఆర్టీసీ డిపో మేనేజర్ టి.రఘు విజ్ఞప్తి చేశారు. వంద రోజుల టీఎస్ ఆర్టీసీ పండుగలో భాగంగా కాచిగూడ ఆర్టీసీ డిపోలో 'అభీ నహీతో కభీ నహీ బస్ భరో' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం డిపో మేనేజర్ రఘు మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సులలో ప్రయాణించే ప్రయాణికులు ప్రయాణం పూర్తి అయ్యాక టికెట్ వెనుక భాగంలో పేరు, ఫోన్ నంబర్ వ్రాసి ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్స్‌లో వేయాలని సూచించారు. లక్కీ డ్రా నిర్వహించి, విజేతలకు రూ.11 లక్షల విలువైన బహుమతులను ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ చేతుల మీదుగా అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. వివరాలకు 9959226130లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపో సీఐ శ్రీనివాస్, సూపరింటెండెంట్ కిషన్, రాధకృష్ణ, బాలమణి, వాసవి, రాములు తదితరులు పాల్గొన్నారు.



'అభీ నహీతో కభీ నహీ బస్ భరో' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతున్న డిపో మేనేజర్ టి.రఘు